క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ లైంగికదాడి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఇద్వా (ఐడియల్ దళిత్ ఉమెన్ అసోసియేషన్) వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తురకపాలెం బాధితులకు లైంగికదాడి నిరోధక చట్టం కింద నష్టపరిహారం, ఆర్థిక పునరావాసాలు కల్పించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బేతపూడి భారతి, బురదగుంట సామ్రాజ్యం, కుమ్మరి కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రజల నుంచి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్లు అధికారులను ఆదేశించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్‌ని డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్‌లు నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 23 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 37 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 9, ఇంజినీరింగ్ విభాగానికి 16, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 5, ఉపా సెల్ విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు.


వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: నగరంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్ నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు విన్నవించారు. సోమవారం కమిషనర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి కుక్కల దాడుల్లో చిన్నారులు బలైపోవడంతో పాటు, పెద్దలు తీవ్ర గాయాలపాలవుతున్న సంఘటనలు రోజుకోక ప్రాంతంలో జరుగుతున్నాయన్నారు. పీ-4 పథకం కింద ఊరి బయట గోశాలలు ఏర్పాటు చేసి రోడ్ల మీద తిరిగే ఆవులను సంరక్షించడంతో పాటు, కుక్కలకు కూడా ప్రత్యేక శునక శాలలు ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జూపూడి శ్రీనివాసరావు, తాటికొండ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్మాత ఆశీస్సులు అందరికీ ఉండాలి

పట్నంబజారు: జగన్మాత ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని, అమ్మవారి దయతో ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని నాలుగో డివిజన్ తమ్మ రంగారెడ్డి నగర్‌లో సోమవారం పార్టీ నాయకులు కేసరి సుబ్బులు, ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన శరన్నవరాత్రుల్లో భాగంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేమూరి వెంకట్ రెడ్డి, మహేంద్ర, పోలక వెంకటరమణారెడ్డి, అట్లూరి ఓబుల్ రెడ్డి, కేసరి అంజిరెడ్డి, శివ పార్వతి, కృష్ణ ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

నమ్మండీ.. ఇదీ రోడ్డేనండీ!



నెహ్రూనగర్: నగరంలో వర్షం పడితే పలు వీధులు మురుగుతో నిండిపోయి బురదకయ్యలుగా మారుతున్నాయి. ముఖ్యంగా హజార్ వారి వీధి(మార్కెట్)లో వర్షం పడిన ప్రతిసారి రోడ్డుపై మురుగు నీరు చేరి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే సదరు ప్రాంతంలో మురుగు తొలగింపునకు అధికారులు చొరవ తీసుకోకపోవడంతో పాదచారుల, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరం ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు తొలగింపునకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, అక్కడ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్కినేని సినీ ప్రస్థానం అద్భుతం

లక్ష్మీపురం: అక్కినేని నాగేశ్వరరావు సినీ ప్రస్థానం ఒక అద్భుతమని, సినీ పరిశ్రమకు ఆయనో లెజెండ్ అని ఏడు దశాబ్దాల పాటు వెండితెరపై తెలుగు వారిని అలరించి వారి అభిమానం పొందారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సినీ నటుడు నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు. కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు నటన అనన్య సామాన్యమన్నారు. 1953 ప్రాంతంలో అక్కినేని నటించి జీవించిన దేవదాసు చిత్రం ఆయన సినీ జీవిత ప్రస్థానంలో ఓ మైలు రాయిగా మిగిలిందన్నారు. కో-ఆర్డినేటర్ బిళ్ళా అశోక్ మాట్లాడారు. రంగస్థల నటులు కావూరి సత్యన్నారాయణ, ఘన శ్యామాచార్యులు ప్రసంగించి నివాళులర్పించారు.



ఆర్.అగ్రహారం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనలక్ష్మీ దేవిగా..



కొత్తపేట శ్రీజగన్నాథస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మీదేవిగా..



లాలాపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీఆదిలక్ష్మీదేవిగా..



ఆర్.అగ్రహారంలో బాలత్రిపుర సుందరిగా..



ఏటుకూరు రోడ్డు శ్రీకన్యకాపరమేశ్వరి ఎన్‌క్లేవ్‌లో బాలత్రిపురసుందరీ దేవిగా..



మల్లిఖార్జునపేట శివాలయంలో బాలా త్రిపుర సుందరీదేవిగా..

బాలా త్రిపుర సుందరీ.. నమోస్తుతే!

నగరంలోని అమ్మవారి దేవాలయాల్లో శ్రీ దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సోమవారం తెల్లవారుజాము నుంచి భక్తులు దేవాలయాలకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అమ్మవారికి పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవార్లను ప్రత్యేక అలంకారాలతో అలంకరించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

– నగరంపాలెం, గుంటూరు ఎడ్యుకేషన్

ఆదాయానికి 'కత్తెర'

- నగరంలో కోనో కార్పస్ మొక్కల కటింగ్ పేరుతో దోపిడీ
- ఒక్కో మొక్క కత్తిరించడానికి రూ.450 పైగా వ్యయం
- రూ.వందలోపే చేయొచ్చంటున్న ట్రిమ్మింగ్ పనివారు
- నగరపాలక సంస్థ ఆదాయానికి గండి



గోరంట్లలో కోనో కార్పస్ మొక్కలను కట్ చేయడంతో మోడుగా కనిపిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: దోపిడీకి కాదేదీ అనర్హం అన్న రీతిలో నగరపాలక సంస్థ పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇందుకు మిషన్ గ్రీన్ గుంటూరు వేదికగా మారింది. నిన్న మొన్నటి దాకా నగరంలో ఉన్న డివైడర్ల మధ్యలో ఉన్న ఎర్రమట్టిని తొలగించి మళ్లీ ఎర్రమట్టిని నింపేందుకు కొన్ని లక్షలు ఖర్చు చేసిన అధికారులు.. మళ్లీ ఇప్పుడు డివైడర్ల మధ్యలో ఉన్న కోనో కార్పస్ మొక్కల కటింగ్ పేరుతో కొత్త దోపిడీకి తెరతీశారు. గుంటూరు నగరంలోని డివైడర్ల మధ్యలో కొన్ని వేల మొక్కలు ఉన్నాయి. అవి చాలా ఏపుగా పెరిగాయి. గతంలో వీటిని పార్కు సిబ్బంది సకాలంలో నీట్‌గా కట్ చేసి (ట్రిమ్మింగ్) అందంగా ఉంచేవారు. కానీ ఇప్పుడు ఎలాగైన కార్పొరేషన్ సొమ్ము దోచే పనిలో పడ్డ పాలకులు వాటి నిర్వహణను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కాంట్రాక్టర్‌కు అప్పగించారు.. బాగానే ఉంది.. సదరు మొక్కలకు ఉన్న ఆకులు పూర్తిగా నరికేసి..ఎండిపోయిన మోడులా ఉంచేందుకు ఒక్కో మొక్కకు రూ.450 దాకా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇదే మొక్కలను ట్రిమ్మింగ్ చేస్తే రూ.వందలోపు ఖర్చు అవుతుందని చెట్లు ట్రిమ్మింగ్ చేసే వారు చెబుతున్నారు. కానీ పాలకులు, అధికారులను అడ్డుపెట్టుకుని కాంట్రాక్టర్లకు ఇష్టానుసారంగా కార్పొరేషన్ సొమ్మును దోచి పెడుతున్నారు.

మొక్కలు ట్రిమ్మింగ్ చేయడానికి వీలుపడదు

నగరంలో డివైడర్ల మధ్యలో ఉన్న మొక్కలను అందంగా ఉంచేందుకు కటింగ్ చేస్తున్నాం. వాటిని ట్రిమ్మింగ్ చేస్తే మంచి ఆకారం రాదు. వాటికున్న కొమ్మలను కట్ చేస్తేనే ఒక షేప్ వస్తుంది. దీనికి కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారో నాకు తెలియదు. కేవలం పర్యవేక్షణ మాత్రమే చేస్తుంటాను.

– శాంతి, పార్కు ఏడీహెచ్

'డయేరియా' ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో డయేరియా అనుమానిత, నిర్ధారిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో అత్యవసర ప్రాధాన్యతా క్రమంలో విధులు నిర్వహించాలన్నారు. మంగళవారం సాయంత్రానికి కేసులు నమోదైన ప్రాంతాలలో తాగునీటి పైపులైన వ్యవస్థ, డ్రెయిన్లలో పూడికతీత, చెత్త డంపింగ్ పాయింట్లు, భవన నిర్మాణ వ్యర్థాలపై మూడు విభాగాల అధికారులు సమగ్ర సర్వే చేసి నోడల్ ఆఫీసర్ ద్వారా నివేదిక ఇవ్వాలన్నారు. వార్డు సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు, ఆర్‌ఓ ప్లాంట్లు, వాటి అనుమతులపై నివేదిక ఇవ్వాలన్నారు. డయేరియా ప్రబలిన వారి నుంచి వారు తీసుకున్న ఆహారం, వినియోగిస్తున్న తాగునీరు తదితర వివరాలు సేకరించాలన్నారు. పైపులైన్ల లీకులను గుర్తించడం, మరమ్మతులు చేయడం, డ్రెయిన్ క్రాస్ అవుతున్న పైప్‌లైన్లు షిఫ్ట్ చేయడం, కేసులు నమోదైన ప్రాంతాల్లో పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా నిలిపివేసి, సర్టిఫైడ్ ఆర్‌ఓ ప్లాంట్ల నుంచి తాగునీటిని సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను రాజీలేకుండా పొక్లెయిన్లతో తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర రామిరెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీ నారాయణ, మేనేజర్ బాలాజీ బాష, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

– నగరంలో వర్షాలకు నీరు నిలిచిన ప్రాంతాల్లో నీటిని బెయిల్ అవుట్ చేయడానికి ఏఈలు అదనపు మోటార్లను, సిబ్బందిని కేటాయించుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ తుఫాన్‌నగర్, మారుతీ నగర్ ప్రాంతాల్లో పర్యటించి, వర్షం నీటిని బెయిల్ అవుట్ చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

పని గంటల పెంపు బిల్లును వెనక్కి తీసుకోవాలి

లక్ష్మీపురం: రాష్ట్రంలో పని గంటలు పెంచుతూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో పెట్టిన బిల్లును వెనక్కి తీసుకోవాలని, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరు అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలియచేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వతహాగా పెట్టుబడిదారుడు కాబట్టి రాష్ట్రంలో పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చిపెట్టేందుకు కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తున్నారని విమర్శించారు. ఏపీఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మేకల రవికుమార్, మెడికల్ రిప్రజెంటెటివ్ యూనియన్ రాష్ట్ర నాయకుడు షేక్ అబ్దుల్ సలీమ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంత రావు తదితరులు మాట్లాడారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

గుంటూరు మెడికల్: సుష్మా గౌడ్ 23వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక పట్నంబజారులోని కార్యాలయంలో సుష్మా గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 430మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు వాకా రాంగోపాల్ గౌడ్, గీత బంధుసేవ ట్రస్ట్ అధ్యక్షుడు వీరంకి రంగారావు, రాష్ట్ర గౌడ సంఘ ప్రధాన కార్యదర్శి వేముల వెంకటాచలం, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ పామర్తి సాంబశివరావు, గౌడ ప్రభ ఎడిటర్ తాత సాంబశివరావు హాజరై చీరెలు పంపిణీ చేసి, సుష్మ గౌడ్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను అభినందించారు. సుష్మ గౌడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తమ కుమార్తె జ్ఞాపకార్థంగా ప్రతి ఏడాది అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. ట్రస్ట్ కార్యదర్శి జల్లెడ ఓంకారం ఉపాధ్యక్షుడు నాగ వెంకట్ శివ ప్రసాద్ గౌడ్, కోశాధికారి జల్లెడ జయ సుస్మిత రావు గౌడ్, ప్రధాన కార్యదర్శి జల్లెడ సుష్మారావు గౌడ్, సహ కార్యదర్శి హరిత గౌడ్ పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్ కట్టడి

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వల్ల నేడు క్యాన్సర్ కేసులు రోజురోజుకు పెరిగిపోవటం ఆందోళన కలిగించే విషయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవటం ద్వారా క్యాన్సర్‌ను కట్టడి చేయవచ్చని తెలిపారు. సోమవారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఉచిత గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని డాక్టర్ యశస్వి రమణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ వైద్యసేవలు అందిస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్‌లు నేడు బాగా పెరిగిపోతున్నాయని, ముందస్తు వైద్య పరీక్షలతో క్యాన్సర్ బారిన పడకుండా నివారించవచ్చన్నారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయ కర్త యడ్లపాటి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 25 వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహిళలకు ఉచితంగా గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని తెలిపారు. పలువురు క్యాన్సర్ వైద్య నిపుణులు, గైనకాలజిస్టులు ఇతర వైద్యులు పాల్గొన్నారు.

నగరంపాలెం ఇన్‌చార్జి సీఐగా ఆర్.కిషోర్ బాధ్యతల స్వీకారం

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐగా ఆర్.కిషోర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నగరంపాలెం సీఐగా విధులు నిర్వహిస్తున్న నజీర్ బేగ్ సెలవులో ఉన్నందున సెలవు రోజులు పూర్తి అయ్యేంత వరకు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి సీఐగా సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న కిషోర్‌ను ఇన్‌చార్జి సీఐగా నియమించారు.

డాక్టర్ వినోద్ కుమార్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వినోద్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ అండ్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ మద్ది వినోద్ కుమార్‌కు జాతీయ స్థాయిలో అవార్డు దక్కింది. ప్రతిష్టాత్మకమైన టైమ్స్ ఆఫ్ ఇండియా నుంచి ఎక్స్‌లెన్స్ ఇన్ జాయింట్ రీప్లేస్మెంట్ అవార్డును పొందారు. శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి ఈ అవార్డును అందుకున్నారు. జాయింట్ రీప్లేస్మెంటులో అత్యధిక సక్సెస్ రేట్ వచ్చిన కారణంగా ఈ అవార్డును అందుకున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా నుంచి అవార్డును అందుకోవటం ఆనందంగా ఉందని డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ అవార్డు స్ఫూర్తితో జాయింట్ రీప్లేస్మెంట్‌లో మరిన్ని విజయాలు సాధిస్తామని ఆయన వెల్లడించారు. జాయింట్ రీప్లేస్మెంట్లో రోబోటిక్ ద్వారా అత్యాధునిక పద్ధతిలో సర్జరీలు చేస్తామని పేర్కొన్నారు.

నేత్ర సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

గుంటూరు మెడికల్: మానవ శరీరంలో అతి కీలకమైన నేత్రాలను పరిరక్షించుకోవటానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సీజీహెచ్ఎస్ (కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం) సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.విద్య సూచించారు. స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం గుంటూరు నగరంపాలెంలోని సీజీహెచ్ఎస్ వెల్ నెస్ కేంద్రంలో 'వాసన్ ఐ కేర్' హాస్పిటల్ సహకారంతో మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల వాడకం వల్ల యువతలో అధికంగా నేత్ర సమస్యలు ఏర్పడుతున్నాయని డాక్టర్ విద్య తెలిపారు. నేత్ర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వయోబేధం లేకుండా ప్రాధాన్యత ఇచ్చి, విరివిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని కోరారు. శిబిరంలో 65 మంది మహిళలు,12 మంది పిల్లలకు కంటి పరీక్షలు చేసి, ఉచితంగా ఔషధాలు పంపిణీ చేసారు. 11 మందికి కాటరాక్ట్ ఆపరేషన్ అవసరమైనట్లు గుర్తించారు. సీజీహెచ్ఎస్ నర్సింగ్ ఆఫీసర్ బి.హేమా సుందరి, లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్యచౌదరి, ఫార్మాసిస్టులు సయ్యద్ ఆయేషా బేగం, సునీల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ల నమోదు ప్రక్రియను జాగ్రత్తగా గమనించండి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా



డివిజన్ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: త్వరలో ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా చెప్పారు. బ్రహ్మానంద రెడ్డి స్టేడియం సమీపంలోని ఆమె కార్యాలయంలో సోమవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని డివిజన్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ ఓట్ల ప్రక్రియలో అవకతవకలు చేసేందుకు కూటమి కుట్రలు చేయటం తథ్యమన్నారు. ఆయా డివిజన్ల పరిధిలోని ఓటర్లను సైతం పక్క డివిజన్లకు పంపి వైఎస్సార్ సీపీ ఓటర్లను మార్చివేసే అవకాశం లేకపోలేదన్నారు. దీంతోపాటుగా ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి ఓట్ల మార్పులు చేర్పుల్లో ఏదైనా అవకతవకలు జరిగాయా అనే అంశంపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో భారీ వర్షాలు కురిసి ఆయా డివిజన్లో పరిధిలో పేద ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇటువంటి నేపథ్యంలో వారి సమస్యలు తెలుసుకుని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకుని వస్తే అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చినుకు పడితే ఆయా ప్రాంతాలన్నీ చిత్తడిగా మారిపోతున్నాయని, శివారు కాలనీలో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నా, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మొద్దు నిద్ర పోతున్నారనీ ధ్వజమెత్తారు. ఇప్పటికే డయేరియా సమస్యతో సుమారు 100 మందికి పైగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, కొంతమందికి ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఒక్కరికీ ఏం జరిగినా ప్రభుత్వం, అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే పోరు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, బూత్ కమిటీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

27న ఏఎల్ బీఈడీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు



పూర్వ విద్యార్థులతో కలిసి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్తేరు సునీల

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్ర లూథరన్ (ఏఎల్) బీఈడీ కళాశాలను స్థాపించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 27న ప్లాటినం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్తేరు సునీల తెలిపారు. సోమవారం లాడ్జి సెంటర్‌లోని కళాశాలలో పూర్వ విద్యార్థులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 1950లో ఏసీ కళాశాలలో ఒక విభాగంగా ఏర్పాటు చేసిన ఏఎల్ బీఈడీ కళాశాల అనంతరం.. 1965లో లాడ్జి సెంటర్లో నిర్మించిన సొంత భవనంలోకి మార్పు చేసినట్లు వివరించారు. బీఈడీ, ఎంఈడీ కోర్సులతో రాష్ట్రంలోనే పురాతన కళాశాలగా గుర్తింపు పొందిన ఏఎల్ బీఈడీ కళాశాలలో చదివిన వేలాది మంది పూర్వ విద్యార్థుల్లో ఎంతో మంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో అనుభవం గడించి, విద్యారంగంలో సమర్థవంతమైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ రంగంలో అధికారులుగా ఎదిగిన వారు ఉన్నారని చెప్పారు. విజ్ఞాన విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి, దివంగత సినీ నటుడు జయ ప్రకాష్‌రెడ్డి కళాశాల పూర్వ విద్యార్థులేనని చెప్పారు. ఈనెల 27న నిర్వహించనున్న కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా పూర్వ విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపాల్స్ డాక్టర్ డి.డేనియల్, డాక్టర్ జె.ప్రశాంత్‌కుమార్, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ కోశాధికారి డాక్టర్ టి.సుగంధరావు, పూర్వ విద్యార్థులు డాక్టర్ ఎం.రఘుకుమార్, డాక్టర్ జె.ప్రశాంత్, పి.ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు ఇన్నారెడ్డి, చంద్రిక, కళాశాల పరిపాలనాధికారి డాక్టర్ సోపాటి అబ్రహాం వెస్లీ పాల్గొన్నారు.

'లలితా'లో మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పి.వి.రాఘవశర్మ

గుంటూరు మెడికల్: స్వస్థ్ నారి – స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గుంటూరు కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్‌లో సోమవారం మహిళలకు ఉచిత ఆరోగ్య స్క్రీనింగ్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అక్టోబర్ 2 వరకు జరగనున్న ఈ ఉచిత వైద్య శిబిరాన్ని హాస్పిటల్ అధినేత, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కుటుంబం, సమాజ ఆరోగ్యం కోసం ఎంతో ముఖ్యమైనదని చెప్పారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నిరోధించవచ్చన్నారు. తద్వారా అవి పెద్ద సమస్యలుగా మారకుండా నివారించవచ్చని తెలిపారు. ప్రతి మహిళ తన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం ద్వారా కుటుంబానికి బలమైన ఆధారం అవుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు తప్పక ఉపయోగించుకోవాలని కోరారు. ఈ చిత స్క్రీనింగ్ శిబిరం ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లలితా సూపర్ స్పెషలిటీస్ హాస్పిటల్ ప్రాంగణంలో జరుగుతుందని వెల్లడించారు. ఈ క్యాంపులో మహిళలకు ఉచితంగా బీపీ, షుగర్, బరువు, బీఎంఐ, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తారన్నారు. అవసరమైన వారికి ప్యాప్ స్మియర్, అల్ట్రాసౌండ్ బ్రెస్ట్ టెస్టులు కూడా ఉచితంగా నిర్వహిస్తారని చెప్పారు. క్యాంప్‌లో పాల్గొనే మహిళలకు కౌన్సెలింగ్, డైట్, జీవనశైలి మార్పులపై వైద్య సలహాలు అందిస్తారన్నారు. ఈ వైద్య శిబిరంలో డెంటల్ సర్జన్ డాక్టర్ స్వాతి, గైనకాలజిస్ట్ డాక్టర్ చంద్రహాస్, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కావ్య, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ నఫీజ్, డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వేత, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ షాజియా, న్యూరాలజిస్టులు డాక్టర్ వీరమ్మ, డాక్టర్ ఉషా కిరణ్, ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ శైలజ, రేడియాలజిస్ట్ డాక్టర్ జ్యోతి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రియ తదితర వైద్యులు పాల్గొన్నారు.